# యముడి ముందు చలం

చలం: ఎవరు? యముడా?

యముడు: అవును.

చలం: ఉన్నావా? లేవనుకున్నాను.

యముడు: అనుకోలేదు. అనుకున్నానుకున్నావు.

చలం: అన్ని మతాలవాళ్లూ అందరూ ఇక్కడికి రావలసిందేనా?

యముడు: యముడిలో నమ్మకం వున్నవాళ్లు.

చలం: తక్కినవాళ్లూ?

యముడు: వాళ్ల నమ్మకం ప్రకారం.

చలం: అసలు నమ్మకం లేకపోతే?

యముడు: ఏమీలేదు. దేంట్లోనూ నమ్మకం లేనివాళ్లకి.

చలం: మరణం తరవాత జీవితంలోనే నమ్మకం లేకపోతే?

యముడు: మరణంతోనే ఆఖరు!

చలం: నాకూ నమ్మకంలేదే! చాలామందికి లేదు ఇప్పుడు.

యముడు: లేదంటే చాలదు. నిజంగా, నిస్సందేహంగా లేకపోవాలి. లేనివాళ్ల జీవితమే వేరు. మృగాలకి లేదు. వాటికి మృత్యువుతోనే అంతం. మరణంతో నిజంగా అంతం అనుకునే మనిషికి, జీవితంపైన ఆ పట్టు వుండనేవుండదు. ఆ రాతలు, ఆ వాదాలూ, ఆ ప్రేమలూ, ద్వేషాలూ నిలిచి పనిచెయ్యవు. నువ్వు చెప్పేదే నిజమ్మని నమ్మకం. అవన్నీ ఏమిటి? ఏదీ నిలవక ప్రతినిముషం బూడిదైపొయ్యే ప్రపంచంలో సత్యమనేది ఎక్కడవుంది?

చలం: కాని మానవజాతి అభివృద్ధి, సత్యానికి కళ్లు తెరవగల...

యముడు: ఏం, మానవజాతి? పదేళ్ల తరవాత ప్రపంచం వుంటుందని ఆ విశ్వాసమేమిటి? సత్యమేదో తెలుసుకుంటుందని ఆ ఆశ ఏమిటి?

చలం: అట్లా అయితే యీ విశ్వాసాలేం లేకుండా స్వార్థంగా బతికేవాడికి ఇక లోకం లేదన్నమాట!

యముడు: స్వార్థంగా బతికేవాడికి వుంది. వాడు



దేనికో బతుకుతున్నాడు గనుక.

చలం:మరి ఎవరికి లేదూ?

యముడు: అంటే అందరికీ వుంది. కాని అనేకవిధాలుగా వుంది.

చలం: నాకు యముడు అనేవాడిలో ఎన్నడూ నమ్మకం లేదు.

యముడు: అయితే యముడినా అని నన్నెందుకు అడిగావు? యముడని నన్నెందుకు అనుకున్నావు?

చలం: అవునేమో, అనుకున్నాను.

యముడు: అందుకునే ఐనాను.

చలం: అనుకోకపోతే?

యముడు: యముణ్ని కాను.

చలం: అప్పుడు ఎవరు?

యముడు: నువ్వెవరని అనుమానిస్తే వాణ్ని.

చలం: తరవాత?

యముడు: తరువాత నువ్వేమని అనుకుంటున్నావో, అది!

చలం: ఏమీ అనుకోవటం లేదు.

యముడు: అబద్ధమాడకు. (నవ్వుతున్నాడు) నేను చెప్పనా? నీకు స్వర్గమా, నరకమా? అనుకుంటున్నావు. అవునా?

చలం: నాకు స్వర్గనరకాలలో నమ్మకంలేదు.

యముడు: అదంతా సరేలే. అది భూలోకంలో పుస్తకాలలో. ఇక్కడ నన్ను చూసి అనుకున్నావా లేదా?

చలం: మరి యముడు గనక తరువాత అంతేకదా నేను అనుకోవలసింది!

యముడు: అవును, అంతేకదా. అదే నిజం!

చలం: సరే, స్వర్గమా, నరకమా?

యముడు: నేను యముణ్ణయినప్పుడు, నరకమేగా నీకు?

చలం: నాకు నరకంలో ఎప్పుడూ నమ్మకంలేదు.

యముడు: లేదు, కాని నీ ఊహలూ, రాతలూ, పనులూ, ప్రపంచంలో ఏ మార్పు తెస్తాయనుకున్నావో? ప్రపంచంలో వాడివేగా నువ్వూను? నీలో అవి తెచ్చే ఫలితమే నరకం.

చలం: స్వర్గం కాకూడదా?

యముడు: కావచ్చు, కాని నరకాన్ని ఏరుకున్నావు.

చలం: ఎప్పుడు?

యముడు: ఇప్పుడే, అంటే నీ జీవితమంతా అన్నమాట!

చలం: అంటే?

యముడు: ఇప్పుడనేది-పూర్వం యెప్పుడూ అనే దాని పర్యవసానం-ఏ కార్యానికైనా ఫలితం వుంటుంది అనే నమ్మకం వుంటే, మరి ఫలితం వుండకుండా వుండదు. మిగిలిపోయిన ఫలితాలు అక్కడ అనుభవించాలి.

చలం: ఆ నమ్మకం లేకపోతే?

యముడు: లేకపోతే స్వర్గం లేదు, నరకం లేదు. కాని ఫలితం కలగదని పనులు చేసే వాళ్లెవరు?

చలం: నేను యముడననీ, నరకమనీ ఎందుకు అనుకున్నానంటే, చిన్నప్పటి భయాలూ, అలవాట్లూ వొదలక, అంతే కానీ నమ్మకం వుండికాదు.

యముడు: మరి ఏం విశ్వసించావు?

చలం: నాకేం తెలీదన్నాను.

యముడు: సరే, ఇప్పుడు నేర్చుకుంటావు.

చలం: ఏం నేర్చుకుంటాను?

యముడు: ఏం నేర్చుకోవాలని వుంటే అదే!

చలం: ఏం లేదని.

యముడు: అదే నేర్చుకుంటావు, నరకంలో.

చలం: మరి ఈ శిక్ష ఎందుకు?

యముడు: నీ అవినీతి కార్యాల ఫలితంగా.

చలం: అట్లా రండి! నీతి అంటే ఏమిటి? అవినీతి అంటే ఏమిటి?

యముడు: నీకు తెలుసా?

చలం: నాకు తెలీదు. తెలుసునన్నవాళ్లతో వాదిస్తాను.

యముడు: నీ వాదాలు నాకు తెలుసు.

చలం: నా పుస్తకాలు చదివారా?

యముడు: నిన్ను చదువుతున్నానుగా ఇప్పుడు?

చలం: నేను చాలాసార్లు మారాను.

యముడు: అన్ని మార్పులతోటీ స్పష్టంగా నిన్ను చదువుతున్నాను.

చలం: మరి చెప్పండి నీతి అంటే ఏమిటో!

యముడు: నువ్వేమంటే అదే!

చలం: అయితే నాకు శిక్ష ఎందుకు?

యముడు: నువ్వనే నీతికే నువ్వు విరుద్ధంగా చాలాసార్లు ప్రవర్తించావు గనక. కాదా?

చలం: అవును. కాని, నా ఆదర్శం చాలా ఉన్నతం.

యముడు: కాని, నీ నీతికీ, నీ ఆదర్శానికీ నువ్వు అపకారం చేసుకున్నావు. దానికి పరిశాంతి ఈ నరకం!

చలం: అసలు ఏ ఆదర్శం లేకుండా, శాస్త్రాల్లోదీ, పొరుగువారనేది నీతిగా తీసుకుని బతికేవారికి నీతిగా వుండడం సులభం.

యముడు: అవును.

చలం: మరి వాళ్లకి?

యముడు: స్వర్గం.

చలం: స్వర్గమా? ఎందుకు?

యముడు: నీతిగా బతికారు గనక. వాళ్ల మనసులో అవినీతి చేశామనే నేరభావం లేదుగనక.

చలం: నేరభావం లేకపోతే చాలునన్నమాట! ఇక నేరమనేది లేదా?

యముడు: అదేగా రాశావు ఇన్నాళ్లూ? పాపపుణ్యాలు లేవనీ, మనసు కల్పించుకుంటోందనీ, ఎవరి అంతరాత్మ వారికి ధర్మకర్త అనీ!

చలం: అంటే స్వర్గనరకాలకి మనసులే ఆధారమా?

యముడు: అవును. అంతే. నువ్వు రాసినమాటలే. కాని నీకు నమ్మకం లేదన్నమాట.

చలం: మరి వీటిని నిర్ణయించే దేవుడు?

యముడు: దేవుడూ అంతే. కావాలంటే వున్నాడు, అక్కర్లేకపోతే లేడు!

చలం: మరి ఇదంతా నిర్ణయించేదెవరు?

యముడు: నువ్వే!

చలం: తక్కినవాళ్లనీ?

యముడు: వాళ్లే!

చలం: మరి నువ్వూ?

యముడు: నువ్వు వున్నావంటే వున్నాను అని చెప్పానుకదూ?

చలం: చాలా అన్యాయంగా వుంది వ్యవహారం.

యముడు: ఏమిటి?

చలం: లేని దేవుడిలో స్వర్గం నమ్మితే స్వర్గమా?

యముడు: ఆ!

చలం: నేను చూసిన దొంగభక్తులకీ, మూఢులకీ, పురుగుల్లాటి క్షుద్రులకీ?

యముడు: వాళ్లకీ అట్లాంటి స్వర్గమే. అంటే, వాళ్లు కోరుకునేలాంటి స్వర్గం. వారు ఆరాధించే దేవుడు.

చలం: విష్ణుభక్తులకి?

యముడు: వైకుంఠం.

చలం: ఎంత బుద్ధిహీనుణ్ని! నేనూ ఓ దేవుణ్ని నమ్మితే...

యముడు: ఏం లాభం? నువ్వు నమ్మలేవు. అయినా ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు. గట్టిగా కోరుకుంటే వైకుంఠానికి వెళ్లవొచ్చు. కాని త్వరలోనే నరకానికి పోవాలని కోరుకుంటావు.

చలం: ఎందుకు?

యముడు: భరించలేక. నీ స్వభావం అట్లాంటిది గనక.

చలం: ఏం చేస్తారు వైకుంఠంలో?

యముడు: ఏం చెయ్యాలని ఆ భక్తులు కోరుకుంటారో అదే!

చలం: భజన! పిడి భజన!

యముడు: అవే భరిస్తావా?

చలం: వాళ్లూ?

యముడు: (నవ్వుతో) అదేదో చాలా గొప్పవని అని మీ లోకంలో ప్రార్థిస్తారు. నీ సాన్నిధ్యంలో చేర్చుకో. ఇంకా మాకేమీ అవసరం లేదని! కాని అన్ని అవసరాలూ వుండనేవుంటాయి. వెడతారు వైకుంఠానికి. రాత్రింబగళ్లు భజనే భజన!

చలం: వాళ్లకి శాంతి అది!

యముడు: అనుకుంటారు భజనలు, విష్ణుసాన్నిధ్యం శాంతినిస్తుందని, భేషజాలకి భక్తి కోరుకుంటారు. కాని దాంటో నిలవలేక యాతనపడతారు.

చలం: నిజంగా భక్తి మాధుర్యం కలవాళ్లో?

యముడు: వాళ్లకి పరవాలేదు. కాని వాళ్లెందరున్నారు? చాలామంది కోరుకునే స్వర్గాలు అంతే, అసలు వాళ్లకి ఇక్కడ ఏం కావాలో తెలిసినవాళ్లెంతమంది?

చలం: మరి వాళ్లేమౌతారు?


యముడు: అట్లా తెలీక వెతుక్కుంటోవుంటారు, అయోమయంగా తెలుసుకున్నదాకా.

చలం: మరి నరకంలో బాధలు పెడతారు కదా!

యముడు: ఎవరన్నారు? నువ్వు కోరుకున్నవన్నీ నరకంలో వున్నాయి. అందుకని అక్కడికి వెడుతున్నావు. మేమేం బాధపెట్టము. ఆ బాధలేవో నువ్వే పెట్టుకుంటావు!

చలం: ఎందుకు పెట్టుకుంటాము?


యముడు: భూలోకంలో ఎందుకు పెట్టుకుంటావు? అక్కడా అంతే!



## అఆలతో కవనవనం

పాతకాలవు పద్నాలుగేళ్ల వధువు తన మనసులో దిగులుగా ఆలోచించే విధానాన్ని చూడండి:

అమ్మయ్య! పెళ్లికూతుర్నైనాను, కానీ మరేమో...
ఆడబడుచు లాంఛనాలకు వారు యేమంటారో?
ఇక్కడలాగ అక్కడ చనువుగా వుండలేనేమో?
ఈ వూరిలాగ ఆ వూరు వుంటుందో మరి వుండదో?
ఉత్తరాలు అమ్మకి వ్రాస్తానంటే శ్రీవారు ఏమంటారో?
ఊయల ఊగే నా అలవాటును వెక్కిరిస్తారేమో?
ఋతుధర్మం ఆ పరిసరాల్లో ఎలాగుంటుందో?
ఎక్కడికైనా వెళ్దామంటే వద్దులే అని అంటారేమో?
ఏ పనులు నేను చేస్తే వారికీ, శ్రీవారికీ నచ్చుతాయో?
ఐకమత్యం కలవారో లేక ఒంటరి ఒంటరివారో?
ఒక్కమాటు ఈ మార్పులు నేనెలా భరించాలో?
ఓణీ వేసుకుంటానంటే చీరే కట్టమని అంటారేమో?
ఔదార్యమంటే నాకిష్టం, మరి వారెలాంటివారో?
అందానికి యెంచితే నన్ను చూచి నవ్వుతారేమో!
అః, అంతఃకరణ శుద్ధి వుంటే మరి పరవాలేదేమో!



కొండుపర్తి సీతారాము(బరంపురం)

చలం: నాకు కావలసినవన్నీ ఇక్కడా వుంటాయిగా?

యముడు: అదే బాధ! కావలసినవన్నీ వుండేబాధ. పైగా అవి నిన్నే పట్టాన వదలవు. స్వర్గంలో భజనలు మల్లేనే తలుచుకో. నీ పుస్తకాలూ, నీ కలలూ...

చలం: మరి ఇంక ఆ లోకానికీ, ఈ లోకానికీ వ్యత్యాసమేముందీ?

యముడు: ప్రయత్నాలూ, ఆశలూ, ఫలించే లోకం ఇది. అంతే. ఆ లోకంలో మిగిలిపోయినవన్నీ.

చలం: ఈ నరకకాలం అయింతరవాత ఏమౌతాను?

యముడు: ఏం లేదు. కాని అనుకోకుండా వుండవు.

చలం: అవ్సరసతో తిరుగుతోవుండాలనుకుంటే...?

యముడు: అపుడెందుకు, ఇప్పుడూ తిరగగలవు. అట్లా కోరుకుంటే, కాని అక్కడంతా శాంతీ సుఖం అనుకోటంలోనే మనుషులు చేసే పొరపాటు. వాళ్ల మనసు వాళ్లతోటే వుంటుంది.

చలం: చాలా అర్థం కాకుండా వుంది.

యముడు: అంతేలే. ఈ జన్మల్ని, ఎవరూ నీ మీద రుద్దటం లేదు.

చలం: మరి సత్యం, న్యాయం, పద్ధతీ, అభివృద్ధీ...

యముడు: అవన్నీ వున్నాయి. కాని నువ్వు అనుకునేట్టు సంకుచితంగా కాదు. విలువలున్నాయి. కాని అవి కనబడవు నీకు. స్వార్థంగా, క్రూరంగా, బతికే మనుషులకి జీవితంలోంచి ఏమొస్తుంది? ఇతరుల కన్నీళ్లలో బాధపడేవాడికి, ఒక్క చిరునవ్వులోంచి వొచ్చే మాధుర్యం ఎవరెరుగుదురు? బైట ఏం జరుగుతోందని కాదు, వాటినుంచి నీ లోపల ఏం జరుగుతోందనే దృష్టి నీకు కలిగిన రోజున సమన్వయం ఎక్కువగా కలుగుతుంది.

చలం: మరి ఈ జననమరణాల్నించి తప్పించుకోవాలని చేసే సాధకులు-మూర్ఖులేనా?

యముడు: వాళ్లకింకా జీవించాలని వుంది. నిజంగా అక్కర్లేకపోతే, జననమరణాల్నించి తప్పించుకోడం ఒక్క నిమిషం పని. జీవితంలో తాము కల్పించుకున్న బాధల్ని తామే వదలేక, ఏదో ముక్తి కావాలనే ఏడుపు ఆ సాధన అంతా.

చలం: మరి యీశ్వరుడు ఆనందమయుడు, ఆత్మ ఆనందస్వరూపం అంటారు, అదేమిటి?

యముడు: దేనిమీదా ఆధారపడని ఆనందం కావాలనుకున్న నిమిషాన అదీ సిద్ధంగానే వుంది.

చలం: మరి అందరూ ఆ ఆనందాన్ని ఎందుకు కోరుకోరు?

యముడు: వాళ్లకి అక్కర్లేదు గనక!

చలం: ఎందుకు అక్కర్లేదు?

యముడు: నీకెందుకు అక్కర్లేదు?

చలం: అక్కర్లేకేం? దొరక్కకాని!

యముడు: దొరకడమేముంది? నువ్వు గట్టిగా ఇంకో దృష్టి లేకుండా వాంఛించాలి అంతే. నిజంగా యోచించుకో. 'ఆనందం' అనేప్పటికి నీ మనసు ఏం వాంఛిస్తుంది? నీ పుస్తకాలు తెప్పించనా? ఆ ఆనందమే పుష్కలంగా దొరుకుతుంది నీకిక్కడ! ఆ రూపాన ఆనందం వొద్దని నువ్వు మొర పెట్టిందాకా.

చలం: నా మొరని ఎవరు వింటారు?

యముడు: నువ్వే!

చలం: విని?

యముడు: విని, ఇంకో రకమైన ఆనందాన్ని కోరుకుంటావు.

చలం: తరువాత?

యముడు: అది సిద్ధిస్తుంది. అంతే నిరంతరంగా, అంతే. అది ఇవ్వలేదనీ, ఇచ్చాడనీ, దేవుణ్నీ, విధినీ, లోకాన్నీ, కర్మనీ తిడుతో బతుకుతారు. ఎవరు వాంఛించేది వాళ్లకి తటస్థించి తీరుతుంది. అంతకన్న కరుణగల విషయం ఆలోచించుకోగలవా? వెళ్లు, వాళ్లందరూ నీకోసం ఎదురుచూస్తున్నారు.

చలం: ఎవరు?

యముడు: నీ కథానాయికలు. నువ్వు వాంఛించి, ఊహించి కల్పించుకున్న ఆదర్శవ్యక్తులు.

చలం: అమ్మో!

యముడు: (నవ్వుతో) చూశావా? నీ నరకం ఇక్కడే ప్రారంభమైంది.

చలం: పోనీ, స్వర్గానికి పోనీరా?

యముడు: నిరభ్యంతరంగా. కాని అక్కడ మునులూ, రాంభజనగాళ్లూ.

చలం: ఆడవాళ్లూ.

యముడు: రాజ్యలక్ష్ములూ, కాంతం, హృదయేశ్వరులూ, సవితలూ వుంటారు.

చలం: వొద్దులెండి, నరకానికే పోతాను.

యముడు: నాకు తెలుసుగా? అంటే నీకు తెలుసుగా?

**(ఈ అలనాటి స్కెచ్ 1948 నాటిది)** ■